సాక్షి
బాపట్ల
శనివారం । 14 । జూన్ । 2025



అమ్మవారి ఆలయంలో చండీ హోమం

దుగ్గిరాల: కంఠంరాజు కొండూరు గ్రామంలో వేంచేసి ఉన్న మహంకాళి అమ్మవారి ఆలయంలో శుక్రవారం అమ్మవారి ఇరుముడి సందర్భంగా చండీ హోమం నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 512.90 అడుగుల వద్ద ఉంది. ఇది 136.6461 టీఎంసీలకు సమానం.

రేపు చర్చి వార్షికోత్సవం



నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్):పునీత ఆంథోని పుణ్యక్షేత్రంలో 35వ వార్షిక వేడుకలను ఆదివారం నిర్వహిస్తున్నట్లు విచారణ గురువు, రెక్టార్ ఫాదర్ కొచ్చెర్ల జ్యోతిరాజు తెలిపారు. శుక్రవారం ఆంథోని స్వరూపాన్ని పూలతో అలకరించిన తేరును ఊరేగించారు.

న్యూస్‌రీల్

రేపు జాతీయ బీసీ సంక్షేమ సంఘం సమావేశం

గురజాల:జాతీయ బీసీ సంక్షేమ సంఘం సమీక్ష సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు అఖిల భారత యాదవ మహాసభ పల్నాడు జిల్లా అధ్యక్షుడు సిద్దాడపు గాంధీ యాదవ్ శుక్రవారం ఓ పత్రికా ప్రకటలో తెలిపారు. సమావేశం బస్టాండ్ ఎదురు గల పల్నాడు కన్వెన్షన్ హాల్‌లో 15న ఉదయం 11 గంటలకు నిర్వహించడం జరుగుతుందన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు యాదవ్ హాజరవుతారని తెలిపారు. మాచర్ల, గురజాల నియోజకవర్గ పరిధిలోని బీసీ, మైనార్టీ నాయకులు పార్టీలకతీతంగా పాల్గొని ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బుద్ధవనం ప్రాంగణంలో 18న యోగాంధ్ర



అమరావతి: స్థానిక ధ్యానబుద్ధ విగ్రహం ఎదురుగా ఉన్న బుద్ధవనం ప్రాంగణంలో ఈ నెల 18వ తేదీన జిల్లా స్థాయిలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించటానికి ఏర్పాట్ల గురించి అధికారులతో సత్తెనపల్లి ఆర్డీవో రమణకాంతరెడ్డి సమావేశమయ్యారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలో నిర్వహించబోయే ఈ కార్యక్రమానికి పలువురు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఏర్పాట్లలో ఎటువంటి లోటుపాట్లు చేకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పార్వతి, తహసీల్దార్ డానియల్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అయ్యప్ప ఆలయ ప్రతిష్ట వార్షికోత్సవాలు

పిడుగురాళ్ల: పట్టణ సమీపంలోని అయ్యప్ప నగర్ ఎదురుగా ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయం ప్రతిష్ట వార్షికోత్సవాలను శనివారం ప్రారంభించనున్నట్లు శుక్రవారం దేవస్థాన శాశ్వత ధర్మకర్త గుండా శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలోని దేవతామూర్తుల విగ్రహాలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై రెండు రోజులు జరిగే కార్యక్రమాలలో పాల్గొనాలని ఆయన కోరారు.

'తల్లికి వందనం' కోసం ఎన్‌పీసీఐలో నమోదు కావాలి

నరసరావుపేట: తల్లికి వందనం పథకంలో ఆర్థిక సాయం పొందేందుకు ఎస్సీలైన 9, 10, ఇంటర్మీడియెట్ విద్యార్థులు బ్యాంకు, పోస్టల్ ఖాతాలకు నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) అనుసంధానం చేసుకోవాలని జిల్లా ఎస్సీ సంక్షేమం, సాధికారిత అధికారి ఈ.ఈశ్వరమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దగ్గరలో ఉన్న గ్రామ, వార్డు సచివాలయాల్లో వెల్ఫేర్, ఎడ్యుకేషనల్ అసిస్టెంట్, డేటా ప్రాసెసింగ్ కార్యదర్శి, బ్యాంకు, పోస్టాఫీసులను సంప్రదించి తమ వివరాలను ఎన్‌పీసీఐలో అనుసంధానం చేసుకోవాలన్నారు. దీనికోసం శనివారం పోస్టల్, గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

16న ఐటీఐ విద్యార్థులకు ప్రాంగణ ఎంపిక

తెనాలి టౌన్: స్థానిక చినరావూరు ఐటీఐ కళాశాలలో ఈనెల 16న నిర్వహించనున్న ప్రాంగణ ఎంపికలను ఐటీఐ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ రావి చిన్న వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులు పాల్గొని ఉద్యోగాలు సాధించాలని ఆయన సూచించారు. ఉదయం 10 గంటలకు ఎంపికలు ప్రారంభమవుతాయని, ఐటీఐ రెండో సంవత్సరం విద్యార్థులంతా పాల్గొని ఉద్యోగాలు పొందాలని ఆయన కోరారు. దాదాపు 15 మల్టీలెవల్ కంపెనీలు పాల్గొంటున్నట్లు వివరించారు.

నిమ్మకాయల ధరలు



తెనాలి: తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2200, గరిష్ట ధర రూ.3200, మోడల్ ధర రూ.2600 వరకు పలికింది.

తల్లికి ఆంక్షల పోటు

- జాబితాలో కోతల కోసం ఆంక్షలు
- ఇంట్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ వస్తే తల్లికి వందనం ఇవ్వరట
- 300 యూనిట్లకు మించి విద్యుత్ వాడితే కట్
- కొత్త నిబంధనలు తెరపైకి తెచ్చి వంచన
- గతంలో ఎంతమంది ఉన్నా ఇస్తామంటూ బూటకపు మాటలు
- ఆచరణ కొచ్చేసరికి జాబితా కుదింపునకు కుట్రలు
- ఇంటికొక్కరికి కూడా ఇచ్చే పరిస్థితి కానరాని వైనం
- వైఎస్.జగన్ పాలనలో జిల్లాలో 1.20 లక్షల మందికి అమ్మ ఒడి



సాక్షి ప్రతినిధి, బాపట్ల: ఇంట్లో ఎంత మంది ఉంటే అంతమందికి తల్లికి వందనం ఇస్తామని గత సార్వత్రిక ఎన్నికల నాటి నుంచి ఇప్పటివరకూ చెబుతూ వస్తున్న కూటమి ప్రభుత్వం ఇప్పుడు మాట తప్పింది. తల్లికి వందనం జాబితాకు కోతలు పెట్టేందుకు సిద్ధమైంది. ఇంట్లో ఉన్న పిల్లలందరికీ ఇవ్వక కొందరికే పథకాన్ని పరిమితం చేయబోతోంది. ఇందుకోసం సరికొత్త నిబంధనలు తెరపైకి తెచ్చి ఆంక్షలు అమలుచేస్తోంది. ఒకే ఇంట్లో ఫీజురీయింబర్స్‌మెంట్ పొందితే ఆ ఇంట్లో ఇతరులకు తల్లికి వందనం ఇవ్వరట. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే ఉపకార వేతనాలు పొందే వారికి ఈ పథకం వర్తించదట. బియ్యంకార్డు లేకపోతే పథకం రాదట. కుటుంబం నెలవారీ ఆదాయం గ్రామీణులకు రూ.10 వేలు, పట్టణాల్లో రూ.12 వేలు మించితే పథకం ఇవ్వరు. మాగాణి మూడెకరాలు, మెట్ట అయితే 10 ఎకరాలు మించి ఉండకూడదు. పట్టణాల్లో వెయ్యి చదరపు అడుగుల స్థలం ఉన్నా, నాలుగు చక్రాల సొంత వాహనం ఉన్నా పథకం వర్తించదు. ప్రతి కుటుంబానికి ఏడాది విద్యుత్ వినియోగాన్ని పరిగణలోకి తీసుకొని నెలకు 300 యూనిట్లకు మించి విద్యుత్ వినియోగించి ఉంటే పథకం రాదు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షన్ పొందుతున్న వారికి పథకం వర్తించదు.

ప్రభుత్వ తీరుపై విమర్శలు

ఇన్ని రకాల ఆంక్షలు విధించి చంద్రబాబు ప్రభుత్వం తల్లికి వందనం పథకానికి తూట్లు పొడిచేందుకు సిద్ధమవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవానికి గురువారం నుంచే పథకాన్ని అమలు చేస్తున్నామని, తల్లుల ఖాతాల్లో డబ్బులు వేస్తున్నామని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు ఆంక్షల జాబితాను సచివాలయాలకు అప్పగించి ఆ మార్గదర్శకాలకు అనుగుణంగా జాబితాలు సిద్ధం చేయాలని ఆదేశాలిచ్చింది. ప్రభుత్వం తెరపైకి తెచ్చిన ఆంక్షలతో ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం వర్తించే అవకాశం కనిపించడంలేదు. ప్రభుత్వం వద్ద ఉన్న జాబితా ప్రకారం జిల్లాలో 1,64,124 మంది పిల్లలు ఉన్నట్లు సమాచారం. ఈ జాబితాను ఆంక్షలకనుగుణంగా పరిశీలన జరిపి వడపోత పోయాలని ప్రభుత్వం అధికారులకు ఆదేశాలిచ్చింది. మొత్తం బాధ్యతలను సచివాలయాలకు కట్టబెట్టింది. ఈ నెలాఖరులోగా సచివాలయ ఉద్యోగులు ఆ బాధ్యతలను నెరవేర్చి వీలైనంతగా జాబితాలను తగ్గించాల్సి వుంది. అదే జరిగితే ఇంటిలో ఉన్న పిల్లలందరి సంగతి దేవుడెరుగు ఇంటికొక్కరికి కూడా పథకం వర్తించేలా కనిపించడంలేదు.

ఆంక్షలు ఎత్తివేయాలి

ఎన్నికల సమయంలో కూటమి నేతలు, అధికారం వచ్చాక ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రులు చెప్పినట్లు ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం అమలు చేయాల్సివుంది. ఇచ్చిన మాటప్రకారం చిత్తశుద్ధితో పథకాన్ని చదువుకునే పిల్లలందరికీ వర్తింపు చేయక జాబితా తగ్గించుకునేందుకు పలు రకాల ఆంక్షలు పెట్టడంపై విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. వాస్తవానికి పేద, మధ్యతరగతి ప్రజలు కూటమి నేతలు చెప్పిన మాటలు నమ్మి వారికి ఓట్లు వేశారు. ఇప్పుడేమో ఏరుదాటాక బోడి మల్లన్న చందంగా చంద్రబాబు ప్రభుత్వం పథకంలో కోతలు పెట్టి జనానికి వెన్నుపోటుపొడవడంపై జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మనసు మార్చుకొని ఆంక్షలు పక్కన బెట్టి చదువుకున్న పిల్లలందరికీ తల్లికి వందనం అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

జగన్ హయాంలో రూ.700 కోట్లు చెల్లింపు

వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జిల్లాలో ఇంటి కొకరు చొప్పున ఇస్తామని చెప్పి మొత్తం 1,19,953 మంది విద్యార్థులకు అమ్మ ఒడి ఇచ్చారు. ఈ మేరకు గడచిన నాలుగేళ్లలో దాదాపు రూ. 700 కోట్లు అమ్మ ఒడి కింద చెల్లించారు. ఈ లెక్కన ఇంటికి ఇద్దరు అనుకుంటే ఈ సంఖ్య రెండింతలు కానుంది. అలా కాకున్నా గతంలో మొత్తం విద్యార్థుల సంఖ్య రెండు లక్షల వరకూ వుంది. ఆ ప్రకారం అనుకున్నా విద్యార్థులు అందరికీ తల్లికి వందనం ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఇప్పుడు 1.64 లక్షల మందిలో ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పరిశీలన జరిపితే ఈ సంఖ్య మరింతగా తగ్గుతుందని విద్యాశాఖ అధికారులతోపాటు సచివాలయ సిబ్బంది పేర్కొంటున్నారు. అదే జరిగితే గత ప్రభుత్వం ఇంటికొకరికి చొప్పున ఇచ్చిన అమ్మ ఒడి జాబితాకు అటు ఇటుగానే తల్లికి వందనం జాబితా ఉండే అవకాశముంది. ఇదే జరిగితే కూటమి ప్రభుత్వం ఓట్లేయించుకొని తల్లులను వంచించినట్లే.



ఫ్రైట్ డిపో కార్యాలయం ప్రారంభం



లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని నల్లపాడులో ఫ్రైట్ డిపో (వ్యాగన్‌లను మరమ్మతు చేసే కార్యాలయం)ను సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్, డివిజన్ డీఆర్ఎం సుధేష్ణ సేన్ శుక్రవారం ప్రారంభించారు. ఆయన వ్యాగన్‌లను మరమ్మతులు చేసే సమయంలో సిబ్బందికి వెయిటింగ్ చేసేందుకు నూతన కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. అనంతరం ఫ్రైట్ డిపో కార్యాలయ ప్రాంగణంలో చెట్లు నాటారు. అక్కడ నుంచి పట్టాభిపురంలోని గుంటూరు రైల్వే డీఆర్ఎం కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రమాద ఘంటికను ఆవిష్కరించారు. డివిజన్ అధికారులతో ఏర్పాటుచేసిన సమీక్ష సమావేశంలో రైల్వే జీఎం మాట్లాడుతూ రైల్వేస్టేషన్‌లలో ప్రయాణికులకు అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సైమన్, సీపీఎం గతిశక్తి మనోహర్ రెడ్డి, సీనియర్ డీఈఎన్ కో-ఆర్డినేషన్ జె.వి.అనూష, సీనియర్ డీఎంఈ ఎం.రవికిరణ్, సీనియర్ డీసీఎం సీహెచ్.ప్రదీప్‌కుమార్, సీనియర్ డీఎం జె.శ్రీనాథ్, సీనియర్ డీఎస్టీఈ జి.రత్నాకర్, సీనియర్ డీఈఈ జి.సూర్యనారాయణ, సీనియర్ డీఈఈ పి.రవితేజ, డీఎస్‌సీ మధుసూదనరావు పాల్గొన్నారు.

ఆర్‌ఓబీల నిర్మాణానికి రూ.572.47 కోట్లు మంజూరు

గుంటూరులోని శ్యామలానగర్, సంజీవయ్య నగర్‌లలో రెండు ఆర్‌ఓబీలకుగాను రైల్వే శాఖ రూ.159.59కోట్లు మంజూరు చేయడంపై రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌ను కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. శంకర్ విలాస్ ఆర్‌ఓబీతోపాటు గడ్డిపాడు, పెద పలకలూరు, నందివెలుగు, మంగళగిరిల్లో ఆర్‌ఓబీల నిర్మాణాలకు నిధులు విడుదలపై హర్షం వ్యక్తం చేశారు.

కుప్పడం పట్టు చీరకు జాతీయ అవార్డు

- ఓడీఓపీ కింద అవార్డు ప్రదానం
- ఢిల్లీలో అవార్డు అందుకోనున్న బాపట్ల కలెక్టర్ జె.వెంకట మురళి
- చీరాల కుప్పడం చీరకు ప్రాచుర్యం



కుప్పడం పట్టు చీరను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: చీరాల కుప్పడం పట్టు చీరలకు జాతీయ అవార్డు లభించనుంది. ఒకే జిల్లా ఒకే ఉత్పత్తి (ఒడిఒపి)కింద కుప్పడం పట్టు చీరలకు జాతీయ అవార్డును ప్రకటిస్తూ కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. జూలై 14వ తేదీన న్యూ ఢిల్లీలోని ప్రగతి మైదానం భారత్ మండపంలో జాతీయ అవార్డుల ప్రదానోత్సవం జరుగునుందని ఆ ఉత్తర్వులలో పేర్కొంది. చీరాల కుప్పడం పట్టు చీరకు ప్రకటించిన జాతీయ అవార్డును బాపట్ల జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి న్యూ ఢిల్లీలో అందుకోనున్నారు. సంప్రదాయ మగ్గాలపై నేతన్నలు నేసిన చీరాల కుప్పడం చీరలకు మార్కెట్ లో ఇప్పటికే కొంత డిమాండ్ ఉంది. కేంద్ర ప్రభుత్వం తాజాగా జాతీయ అవార్డు ప్రకటించడంతో మరింత ప్రాచుర్యం పొందనుంది. దీంతో చేనేతల కష్టం ఇక ఫలించనుంది. జాతీయ మార్కెట్ లోనూ కుప్పడం చీరలు ప్రత్యేకతను సంతరించుకోనుంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటనతో చీరాల కుప్పడంకు జాతీయస్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించింది. చేనేత వృత్తినే నమ్ముకుని వందలాది చేనేత కుటుంబాలు బాపట్ల జిల్లా చీరాల పేరాలలో కొన్నేళ్లుగా జీవనం సాగిస్తున్నాయి. సంప్రదాయ మగ్గాలపై చేనేత కార్మికులు కష్టపడి నేసిన కుప్పడం చీరలకు ఒకప్పుడు ఎంతో డిమాండ్ ఉండేది. యంత్రాల చొరబాటుతో కుప్పడం చీరల ఉత్పత్తి సన్నగిల్లిందని కార్మికులు ఆందోళన చెందుతున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటనతో చేనేతల ఆశలు పునర్జీవం పోసుకున్నాయి. అలనాటి స్వాతంత్ర్య ఉద్యమంలో మహాత్మాగాంధీజీ ఇచ్చిన పిలుపు అందుకున్న చీరాల పేరాల చేనేత కార్మికులు విదేశీ వస్త్రాలను వ్యతిరేకించడంలో ప్రధానపాత్ర పోషించారు. నేత వస్త్రాల ఉత్పత్తులకు చీరాల క్షీరపురిగా మారిందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఏడాది జనవరి 9వ తేదీన కేంద్ర బృందం సభ్యులు ఇష్ దీప్, డాక్టర్ దివ్యడింగ్రా క్షేత్రస్థాయి పరిశీలనపై బాపట్ల చీరాలలో పర్యటించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కుప్పడం చీరల ప్రదర్శనను కేంద్ర బృందం సభ్యులు, జిల్లా కలెక్టర్ కలిసి పరిశీలించారు. ఆ సమయంలోనే చీరాలలో చేనేత వస్త్రాలైన కుప్పడం చీరల ఉత్పత్తులు, అమ్మకాలు, చేనేత కార్మికుల జీవన స్థితిగతులపై కేంద్ర బృందానికి కలెక్టర్ నివేదిక అందజేశారు. పూర్తిస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించిన కేంద్ర ప్రభుత్వం చీరాల కుప్పడం చీరలకు ఒకే జిల్లా ఒకే ఉత్పత్తి (ఒడిఒపి) కింద గుర్తింపునిస్తూ జాతీయస్థాయి అవార్డును ప్రకటించింది. జాతీయస్థాయి అవార్డును జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి జూలై 14వ తేదీన అవార్డు అందుకోనున్నారు.

రుణాలు పంపిణీ వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: ప్రాధాన్యత, ప్రాధాన్యత లేని రంగాలకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో విస్తృతంగా రుణాలు ఇవ్వాలని వార్షిక ప్రణాళిక రూపొందించినట్లు జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి చెప్పారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో బ్యాంకర్ల జిల్లా స్థాయి సమీక్ష సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రుణాల పంపిణీలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధికారులు నూరు శాతం చేరుకోవాలని అన్నారు. గతేడాది రైతులకు ఒక లక్ష సీసీఆర్సీ కార్డులు జారీ చేయగా, అందులో 23 వేల మందికి మాత్రమే రుణాలు మంజూరు చేశారని అన్నారు. ఈ సంవత్సరం లక్ష సీసీఆర్సీ కార్డుల మంజూరుకు లక్ష్యాలను నిర్దేశించారని, అందులో ఇప్పటివరకు 3,800 కార్డులు జారీ చేసినట్లు తెలిపారు. పాత సీసీఆర్సీ కార్డులను రెన్యువల్ చేయాలని జిల్లా కలెక్టర్ వ్యవసాయ శాఖ అధికారికి సూచించారు. సీసీఆర్సీ కార్డుదారులకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.200 కోట్ల రుణాలు ఇవ్వాలని, బ్యాంకు బ్రాంచీల ప్రకారం లక్ష్యాలను నిర్దేశించాలని ఎల్డీఎంకు సూచించారు. జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడానికి ఈ పథకంలో స్వయం సహాయక గ్రూపు సభ్యులను చేర్చడమైనదని తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ పథకాల అమలులో భాగంగా రుణాల కోసం బ్యాంకులకు లబ్ధిదారులు చేసుకున్న దరఖాస్తుల పురోగతిపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. బ్యాంకుల వారీగా లక్ష్యాలను పూర్తి చేయకపోవడానికి గల కారణాలను ఆరా తీశారు. జిల్లాకు 36 కిసాన్ డ్రోన్ యూనిట్లను లక్ష్యంగా ఇచ్చారని తెలిపారు. జిల్లాలో ఒక లక్ష 60 వేల మంది రైతులు ఉన్నారన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం కింద కౌలు రైతులను పంట బీమా చేయించాలని, బీమా వలన కలిగే ప్రయోజనాలను వివరించి వారికి అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ బ్యాంకర్లకు సూచించారు.

ఉత్పత్తి రంగాలకు రుణాలు ఇవ్వాలి

ఉత్పత్తి రంగాల అభివృద్ధికి అధిక రుణాలు ఇవ్వాలని కలెక్టర్ వెంకట మురళి తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా ప్రాధాన్యత, ప్రాధాన్యత లేని రంగాలను కలిపి 7.51 లక్షల మందికి రుణాలు ఇచ్చి ఆయా ఉత్పత్తులు పెంచుకోవడానికి రూ.15 వేల 820 కోట్లు రుణాలు ఇవ్వాలని వార్షిక ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. 2024- 25 ఆర్థిక సంవత్సరంలో రూ.13 వేల 444 కోట్ల వార్షిక లక్ష్యానికి రూ.16 వేల 603 కోట్ల రుణం మంజూరు చేసినట్లు బ్యాంకర్లు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. సమావేశం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణ, డీఆర్డిఏ పీడీ శ్రీనివాసరావు, నాబార్డ్ డీడీఎం రవికుమార్, ఆర్బీఐ ఎల్డిఓ నవీన్ బాబు, యూనియన్ బ్యాంక్ రీజనల్ అధికారి మాధురి, ఎల్‌డీఎం శివకృష్ణ, వివిధ బ్రాంచీల బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

రైలు ఢీకొని ముగ్గురు మృతి



మృతి చెందిన యువకుడు

చీరాల రూరల్: రైలు ఢీకొన్న ప్రమాదంలో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం చీరాల రైల్వేస్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. జీఆర్పీ ఎస్సై సీహెచ్ కొండయ్య తెలిపిన వివరాల మేరకు.. మధ్యాహ్నం సుమారు మూడు గంటల సమయంలో దిగువ లైన్‌పై వృద్ధుడు మృతి చెందాడనే సమాచారంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించినట్లు ఎస్సై చెప్పారు. మృతుని వయస్సు సుమారు 55 నుంచి 60 సంవత్సరాల మధ్య ఉంటుందని, 5.5 అడుగుల ఎత్తు, చామన ఛాయ, తెలుపు తల వెంట్రుకలు, ఛాతీ ఎడమవైపు ఒక పుట్టుమచ్చ, కుడితొడపై మరో పుట్టుమచ్చ కలిగి ఉన్నాడని తెలిపారు. శరీరంపై తెలుపురంగు అరచేతుల చొక్కా, నీలం, తెలుపు రంగుల చారలు కలిగిన లుంగీ ఉందని, మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుని ఆచూకీ తెలిస్తే 9440627646 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

రైలు నుంచి జారిపడి..

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని యువకుడు మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్సై కొండయ్య శుక్రవారం తెలిపారు. సుమారు 30 సంవత్సరాలు కలిగిన గుర్తు తెలియని యువకుడు ఎగువకు వెళ్లే గుర్తు తెలియని రైల్లో ప్రయాణిస్తూ చినగంజాంలోని సోపిరాల రైల్వేగేటు వద్ద ప్రమాదవశాత్తు జారిపడి బలమైన రక్త గాయాలు కావడంతో మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కుడిచేతి షోల్డర్ మీద విజయలక్ష్మి అనే పచ్చబొట్టు ఉందని చెప్పారు. మృతుడి ఆచూకీ తెలిస్తే జీఆర్పీ ఎస్సై 9440627646 నంబర్‌కుసమాచారం అందించాలని సూచించారు.

చినగంజాంలో...

చినగంజాం: రైలు నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం ఉదయం చినగంజాం రైల్వేస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు.. చినగంజాం రైల్వేస్టేషన్‌కు ఉత్తరం వైపు సుమారు అరకిలోమీటరు దూరంలో విజయవాడ నుంచి చెన్నై వెళ్లే లైన్‌లో రైలు నుంచి జారిపడి తీవ్రగాయాల పాలై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుని వయస్సు 35 నుంచి 40 ఏళ్లలోపు ఉంటుందని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు జరుపుతున్నామని రైల్వే ఎస్ఐ కొండయ్య వివరించారు.

'కూటమి'పై పోరుకు న్యాయవాదులు సిద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు

పట్నంబజారు: ప్రభుత్వం మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడితే సామాజిక బాధ్యతగా న్యాయవాదులు పోరాటానికి సిద్ధం కావాలని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ లీగల్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మలసాని మనోహర్‌రెడ్డి, మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు పిలుపునిచ్చారు. జేకేసీ కళాశాల రోడ్డులోని వికాస్ ఇన్ ఫంక్షన్ హాలులో శుక్రవారం న్యాయవాదుల సమావేశం పార్టీ జిల్లా విభాగం, లీగల్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటనలో మృతి చెందిన వారికి సంతాపం తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో, పార్టీ అభ్యర్థులు ఓటమి పాలై బాధతో బయకు రాలేని పరిస్థితుల్లో న్యాయవాదులు కార్యకర్తలకు భరోసా కల్పించి అండగా నిలిచారని తెలిపారు. వైఎస్సార్ సీపీ హయాంలో 300 మందికి అనేక పదవులు ఇచ్చారని పేర్కొన్నారు. వై.ఎస్.జగన్ చెప్పిన విధంగా పార్టీని రాష్ట్రం, దేశంలో అతిపెద్ద శక్తిగా తయారు చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. రాష్ట్రంలో న్యాయవాదులు ఒక మోడల్‌గా తీసుకునే విధంగా గుంటూరు న్యాయవాదులు పనిచేశారని కొనియాడారు.

కార్యకర్తలు, నేతలకు అండగా నిలవాలి

సభకు అధ్యక్షత వహించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ఐదేళ్లపాటు కార్యకర్తలు, నేతలకు అండగా నిలవాల్సిన బాధ్యత లీగల్ విభాగంపై ఉందని తెలిపారు. పరిపాలన కన్నా, కక్షసాధింపు చర్యలకు కూటమి సర్కార్ ప్రాధాన్యత ఇస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయవాదులు ఏడాది కాలంలో ఇచ్చిన ధైర్యం అద్భుతమని, ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆయన సూచించారు.

న్యాయవాదుల పోరాటం అద్భుతం

ఎమ్మెల్సీ, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ న్యాయవాదులు క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు.

మహిళా న్యాయవాదులు స్పందించాలి

పార్టీ గుంటూరు జిల్లా పరిశీలకుడు పోతిన మహేష్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని, చట్టాన్ని కాపాడాల్సిన బాధ్యత న్యాయవాదులపై ఉందని తెలిపారు. వై.ఎస్.జగన్ హయాంలో చట్టానికి లోబడి పరిపాలన కొనసాగిందని పేర్కొన్నారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై మహిళ న్యాయవాదులు స్పందించాలని ఆయన సూచించారు.

తప్పుడు కేసులతో వేధింపులు

డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ మీడియాపై ఆంక్షలు పెట్టడం సరికాదని హితవు పలికారు. 'సాక్షి'ని మూసివేయించేందుకు దుర్మార్గపు ఆలోచనలు చేస్తున్నారని మండిపడ్డారు.

రాష్ట్ర హోంమంత్రి వ్యాఖ్యలు చట్ట విరుద్ధం

- దళిత, ముస్లిం యువకులపై లాఠీలతో కొట్టిన సీఐలను అరెస్టు చేయాలి
- దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు

చీరాల రూరల్: తెనాలిలో దళిత, ముస్లిం యువకులపై తెనాలి 2, 3 పట్టణ సీఐలు జరిపిన తాలిబన్ దాడిని ఖండిస్తున్నామని, అందుకు బాధ్యులైన ఇద్దరు సీఐలను అరెస్టు చేయాలని, పోలీసులు కొడితే తప్పేముందన్న రాష్ట్ర హోంమంత్రి అనితను పదవి నుంచి తొలగించాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన దళిత మహాసభ రాష్ట్ర నాయకుడు మాచవరపు జూలియస్‌తో కలసి దళిత మహాసభ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రౌడీషీటర్ల పేరుతో దళిత, ముస్లిం యువకులను నడిరోడ్డుపై బహిరంగంగా అందరూ చూస్తుండగా లాఠీలతో ఇష్టానుసారంగా కొట్టి హింసించడం దారుణమన్నారు. యువకులను కొట్టే హక్కు పోలీసులకు లేదన్నారు. పోలీసులకు కేసులు నమోదు చేసి కోర్టులకు పంపే అధికారం మాత్రమే ఉందన్నారు. ఒంగోలులో తెలుగుదేశం పార్టీకి చెందిన వీరయ్య చౌదరి అనే మాజీ రౌడీషీటర్ హత్యకు గురైతే హుటాహుటిన హోంమంత్రి అనిత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వచ్చి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియలకు కూడా హాజరయ్యారన్నారు. తెనాలిలో దళిత యువకులను రౌడీషీటర్లు అంటున్న హోంమంత్రి అనిత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో కలసి మాజీ రౌడీషీటర్ వీరయ్య చౌదరి అంత్యక్రియలకు ఏవిధంగా హాజరయ్యారో చెప్పాలని డిమాండ్ చేశారు. నేరాలకు కులం, మతం ఉండదన్న హోంమంత్రి అమరావతి మహిళల అవమానం కేసులో జర్నలిస్టులు కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజులను అరెస్టు చేయించటానికి ఎస్సీ, ఎస్టీ కేసు ఎందుకు పెట్టించారని ప్రశ్నించారు. న్యాయమూర్తి జిల్లా ఎస్పీని, డీఎస్పీని మందలించి ఎస్సీ, ఎస్టీ కేసును తొలిగించింది నిజమా కాదా హోంమంత్రి చెప్పాలన్నారు. కరోనా సమయంలో చీరాలలో దళిత యువకుడు కిరణ్‌కుమార్‌ను మాస్కు పెట్టుకోలేదనే నెపంతో అప్పటి టూటౌన్ ఎస్సై కొట్టగా కిరణ్‌కుమార్ చనిపోయాడని, అందుకు ఎస్సైను బాధ్యుడిని చేస్తూ హత్యానేరం కింద ఎస్సైను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించింది నిజంకాదా అని ప్రశ్నించారు. ఇప్పటికీ ఎస్సై కోర్టుల చుట్టూ తిరుగుతున్నాడో లేదో హోంమంత్రి సమాధానం చెప్పాలన్నారు. రేణంగివరం పోలీసు స్టేషన్లో జె.పంగులూరు మండలం కోటపాడు గ్రామానికి చెందిన మాదిగ యువకులని పోలీసుస్టేషన్‌లోనే కొట్టి హింసించిన కేసులో ఒంగోలు ఎస్సీ, ఎస్టీ కోర్టు ఎస్సై జగన్మోహనరావుకు రెండు సంవత్సరాలు శిక్ష విధించిందన్నారు. పోలీసులు కొట్టే హక్కు ఉంటే కోర్టులు ఎందుకు శిక్షలు విధించాయో హోం మంత్రి సమాధానం చెప్పాలన్నారు. పోలీసులు కొట్టడం కరెక్టు అయితే పై రెండు కేసులలో నిందితులైన ఇద్దరు ఎస్సైలపై కోర్టులు విధించిన శిక్షలను హోం మంత్రి తన అధికారంతో రద్దు చేయించగలరా అని ప్రశ్నించారు. తెనాలిలో దళిత, ముస్లిం యువకులపై దాడికి పాల్పడిన సీఐలపై అట్రాసిటీ కేసు నమోదుచేసి అరెస్టు చేయాలని, పోలీసులు కొడితే తప్పేముందన్న హోంమంత్రి అనితను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఉదయం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య, కార్యదర్శి కాకుమాను రవి, దళిత బహుజన పార్టీ అధ్యక్షుడు షేక్ జిలాని పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసుల్లో ఉద్యోగాలు రిలీఫ్‌లు ఇవ్వాలి

బాపట్ల: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ కేసుల్లో ఉద్యోగాలు, రిలీఫ్‌లు త్వరితగతిన మంజూరు చేయాలని బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకట మురళిని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం బాపట్ల కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి బాపట్ల జిల్లా ఏర్పడిన ఏప్రిల్ 22 నుండే కాకుండా అంతకుముందు చీరాల పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్‌స్టేషన్లలో జరిగిన కేసుల్లో కూడా రిలీఫ్, ఉద్యోగాలు పెండింగులో ఉన్నాయన్నారు. ఇంకొల్లు పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక దళిత యువతి కిడ్నాప్ అత్యాచారం క్రైమ్ నెంబర్241/2021 కేసులో నాలుగేళ్లయిన రిలీఫ్ ఉద్యోగం ఇవ్వలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో ఎఫ్ఐఆర్ స్టేజీలో ఫిర్యాదులో పేర్కొన్న బాధితులందరికీ రిలీఫ్ ఇవ్వాల్సి ఉండగా ఒక్క ఫిర్యాదుదారునికి మాత్రమే రిలీఫ్ మంజూరు చేస్తున్నారన్నారు. వీటితోపాటు పలు కేసులకు సంబంధించిన వివరాలను అందించారు. స్పందించిన జిల్లా కలెక్టర్ వెంటనే డీఆర్ఓ గంగాధర్‌గౌడ్‌కు ఫోన్ చేసి ఎస్సీ, ఎస్టీ రిలీఫ్ ఫైల్స్ పెండింగ్ లేకుండా క్లియర్ చేయించాలని ఆదేశించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షులు మాచవరపు జూలియస్, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దారా అంజయ్య కార్యదర్శి కాకుమాను రవి ఉన్నారు.

బాపట్ల జిల్లా యువజన విభాగం కమిటీ ఎంపిక

బాపట్ల: బాపట్ల జిల్లా యువజన విభాగ కమిటీ ఎంపిక చేస్తూ వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఉపాధ్యక్షులుగా వేమూరుకు చెందిన వై.రవిశంకర్‌రెడ్డి, చీరాలకు చెందిన కె.ప్రసాదరెడ్డి, జనరల్ సెక్రటరీలుగా అద్దంకి చెందిన జి.బ్రహ్మారెడ్డి, రేపల్లెకు చెందిన కె.రామ్‌గోపాల్, పర్చూరుకు చెందిన వై.శ్రీకాంత్ బాబు, బాపట్లకు చెందిన మల్లెల పవన్‌కుమార్, బాపట్లకు చెందిన యల్లావుల సురేష్ రాఘవ, సెక్రటరీలుగా బాపట్లకు చెందిన ఎస్.నాగరాజు, రేపల్లెకు చెందిన కె.శ్రీనివాసరావు, పర్చూరుకు చెందిన కె.అనంతకుమార్‌రెడ్డి, వేమూరుకు చెందిన పేకా సన్నీ, చీరాలకు చెందిన మొగిలి సారథి, చీరాలకు చెందిన రామకృష్ణ, అద్దంకి చెందిన వై.ఆరోను, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా బాపట్లకు చెందిన వై.కొండా, చీరాలకు చెందిన జి.భాగ్యరాజు, చీరాలకు చెందిన బాలకోటిరెడ్డి, వేమూరుకు చెందిన ఏ.కొండారెడ్డి, వి.రవితేజ, మేగానంద సాయి తేజ, పర్చూరుకు చెందిన పి.ప్రసాదబాబు, షేక్. మస్తాన్‌వలి, జి.రామకృష్ణ, రేపల్లెకు చెందిన జి.ప్రసన్నతేజ, టి.శివ వెంకటకృష్ణ, పి.నాగేశ్వరరావు, అద్దంకి చెందిన డి.శ్రీను, ఎం.సురేంద్రరెడ్డి, జి.వెంకటేష్‌లను నియమించారు. ఈమేరకు పలువురు అభినందించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

అద్దంకి: పట్టణ శివారులోని వంతెనకు సమీపంలోని ఒక చెట్టుకు వేలాడుతున్న గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించినట్లు సీఐ సుబ్బరాజు శుక్రవారం తెలిపారు. ఉరి వేసుకున్న స్థితిలోని మృతదేహాన్ని పరిశీలించగా అతని వయస్సు సుమారు 55 సంవత్సరాలు ఉండవచ్చని, అతన్ని ఎవరైనా హత్య చేశారా? లేక ఆత్మ హత్యా అనే విషయాలు విచారణలో వెల్లడి కావాల్సి ఉందని తెలిపారు.

సర్పంచుల పిల్లలకూ 'తల్లికి వందనం' అమలు చేయాలి

అమరావతి: గ్రామానికి ప్రథమ పౌరులైన సర్పంచుల పిల్లలకు తల్లికి వందనం కింద ఆర్థిక సాయం బ్యాంకు ఖాతాలో జమ కాలేదని ఆంధ్రప్రదేశ్ పంచాయతీ పరిషత్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సర్పంచ్ ప్రభుత్వ ఉద్యోగికి ఉన్నట్లుగా సీఎఫ్ఎంఎస్ఐడీ ఉండటం వలన పిల్లలు అనర్హులయ్యారని తెలిపారు. ప్రభుత్వం గౌరవ వేతనంగా రూ.3వేలు చొప్పున సంవత్సరానికి రూ.36 వేలు మాత్రమే సర్పంచులకు చెల్లిస్తోందన్నారు. దీనిపై ప్రభుత్వం తగిన ఆదేశాలు జారీ చేయాలన్నారు. రాష్ట్రంలో యాభై శాతం ఎస్సీ ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన సర్పంచులు ఉన్నారన్నారని గుర్తుచేశారు. వీరిలో అత్యధికంగా నిరుపేదలు ఉన్నారని పేర్కొన్నారు.

సోషల్ వెల్ఫేర్ డీడీగా చెన్నయ్య

నెహ్రూనగర్: జిల్లా సోషల్ వెల్ఫేర్ డీడీ(డెప్యూటీ డైరెక్టర్)గా యు. చెన్నయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లా డీఎస్‌డబ్ల్యూఓ(జిల్లా సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్)గా పని చేస్తున్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా గుంటూరుకు వచ్చారు. గతంలో ఇక్కడ డీడీగా పనిచేసిన డి.మధుసూదనరావు ఆరు నెలలకుపైగా సెలవులో ఉండటంతో బాపట్ల జిల్లా డీఎస్‌డబ్ల్యూఓగా పని చేస్తున్న రాజా దేబోరా గుంటూరు జిల్లా ఇన్‌చార్జి డీడీగా పనిచేశారు.

మాచర్లలో అత్యధిక వర్షపాతం

నరసరావుపేట: గడిచిన 24 గంటల వ్యవధిలో జిల్లాలోని పలు మండలాల్లో 198 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మాచర్లలో అత్యధికంగా 97.6 మి.మీ. కురిసినట్లు అధికారులు శుక్రవారం వెల్లడించారు. వెల్దుర్తిలో 23.4, క్రోసూరు, గురజాలలో 2.8 చొప్పున, సత్తెనపల్లి- 12.8, రాజుపాలెం - 4.8, నకరికల్లు - 1.0, బొల్లాపల్లి - 4.2, వినుకొండ - 7.2, నూజెండ్ల - 4.6, ఈపూరు - 12.4, రొంపిచర్ల - 5.6, నాదెండ్ల - 2.2, చిలకలూరిపేట - 5.4, యడ్లపాడు - 11.2 మి.మీ. వంతున వర్షపాతం నమోదైంది.

క్లుప్తంగా

దూరవిద్య సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

నరసరావుపేట ఈస్ట్: సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన 10వ తరగతి, ఇంటర్మీడియెట్ దూరవిద్య సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు ఆన్‌లైన్‌లో విడుదల చేసి అందుబాటులో ఉంచినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ శుక్రవారం తెలిపారు. అభ్యాసకులు www.apopenrchoo.ap.gov.in వెబ్‌సైట్‌లో తమ వివరాలను పొందుపరచటం ద్వారా నేరుగా ఫలితాలు తెలుసుకోవచ్చని వివరించారు. మన మిత్ర నెంబర్ 95523 00009కు ఏజీ అనే మెసేజ్ చేయటం ద్వారా ఫలితాలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. కాగా, 10వ తరగతి దూరవిద్య సప్లిమెంటరీ పరీక్షలో పల్నాడు జిల్లా నుంచి 524 మంది పరీక్షకు హాజరు కాగా 425 మంది ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. 81.11 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 9వ స్థానంలో జిల్లా నిలిచిందన్నారు. దూరవిద్య ఇంటర్ సప్లిమెంటరీలో 841మంది విద్యార్థులకుగాను 680 మంది ఉత్తీర్ణులయ్యారని, 80.86 ఉత్తీర్ణతా శాతంతో 4వ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. అభ్యాసకులు తమ ఫలితాలపై రీవెరిఫికేషన్, రీకౌంటింగ్‌కు ఈనెల 16 నుంచి 25వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒక్కో సబ్జెక్టుకు రీకౌంటింగ్‌కు రూ.200, రీ వెరిఫికేషన్‌కు రూ.1000 చెల్లించాలని తెలిపారు.

ట్రాఫిక్ సిబ్బందికి 15 నూతన బైకులు



నరసరావుపేట రూరల్: జిల్లాలో ట్రాఫిక్ నియంత్రణకు కేటాయించిన 15 నూతన ద్విచక్ర వాహనాలను జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు శుక్రవారం ఆయా పోలీస్‌స్టేషన్‌లకు అందజేశారు. ట్రాఫిక్ నియంత్రణ విధుల్లోని సిబ్బందికి పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్ 15 ద్విచక్ర వాహనాలను కేటాయించింది. ఇందులో 14 అపాచి బండ్లు, ఒకటి బుల్లెట్ వాహనం ఉన్నాయి. నరసరావుపేటకు రెండు అపాచి, ఒక బుల్లెట్, చిలకలూరిపేటకు, వినుకొండ, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, మాచర్ల పట్టణాలకు రెండు చొప్పున, గురజాల, దాచేపల్లికి ఒకటి వంతున అపాచి వాహనాలు అందజేశారు.

నగరపాలక సంస్థ ఎంహెచ్ఓ సరెండర్

నెహ్రూనగర్: నగరంలో పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో నిర్లక్ష్య వైఖరి కారణంగా మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ (ఎంహెచ్ఓ) డాక్టర్ ఎం.రవిబాబుని మాతృశాఖకు సరెండర్ చేశామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు సూచించిన పనుల్లో పర్యవేక్షణ లోపం కనపరచడంతో ఆయన్ను సరెండర్ చేశామని పేర్కొన్నారు. పరిపాలన అవసరాల రీత్యా తూర్పు నియోజకవర్గానికి రామారావు, పశ్చిమ నియోజకవర్గానికి సోమశేఖర్‌లను ఇన్‌చార్జి ఎంహెచ్ఓలుగా కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశామన్నారు.

లారీని ఢీకొట్టిన బస్సు..నలుగురికి గాయాలు


ముందు భాగం నుజ్జు నుజ్జయిన బస్సు

అద్దంకి: ముందు వెళ్తున్న లారీని బస్సు ఢీకొని బస్సులోని నలుగురికి గాయాలైన సంఘటన మండలంలోని చిన్నకొత్తపల్లి డొంక వద్ద అద్దంకి నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారిలో గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత జరిగింది. అందిన సమాచారం మేరకు ఓ ప్రైవేటు ట్రావెల్ బస్సు కందుకూరు నుంచి హైదరాబాద్ బయలుదేరింది. ఆ బస్సు మండలంలోని చిన్నకొత్తపల్లి డొంక వద్దకు రాగానే, అదే మార్గంలో చిన్నకొత్తపల్లి మిల్లు వద్దకు వెళ్లే క్రమంలో మలుపు తిరుగుతున్న లారీని వెనుకగా ఢీ కొట్టింది. దాంతో బస్సులో కుదుపు రావడంతో అందులో ప్రయాణిస్తున్న షేక్ యాకోబ్‌బాషాతోపాటు ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు, 108 సిబ్బంది అక్కిడికి చేరుకున్నారు. సంఘటన వివరాలు తెలుసుకుని కేసు నమోదు చేశారు. క్షతగాత్రుడు షేక్ యాకోబ్ బాషాను 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి వైద్యం అందించారు. ఈ ఘటనలో బస్సు ముందు భాగం నుజ్జు నుజ్జయింది.

తరచూ ప్రమాదం..డెడ్ స్పాట్

ఈ స్థలంలో గ్రామానికి వెళ్లే రోడ్ క్రాసింగ్ ఉండటంతో పలుమార్లు కార్లు బోల్తా కొట్టడం, ప్రయాణికుల ప్రాణాలు గాల్లో కలసి పోయిన సంఘటనలు కోకొల్లలు. ఇక్కడ ప్రమాద నివారణకు సరైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అంతర్ జిల్లా దొంగను పట్టుకున్న పోలీసులు


అంతర్ జిల్లాదొంగతో రేణింగవరం పోలీసులు

జె.పంగులూరు: అంతర్ జిల్లా దొంగ పబ్బరాజు వెంకట యుగంధర్‌ను పట్టుకున్నట్లు శుక్రవారం ఎస్సై వినోద్‌బాబు తెలిపారు. బూదవాడ గ్రామానికి చెందిన వజ్రాల కృష్ణారెడ్డిని వెంకటయుగంధర్ గత నెలలో ఇల్లు అద్దెకు కావాలని అడిగాడు. మంచి వ్యక్తి అని నమ్మి బూదవాడ గ్రామానికి చెందిన హనుమారెడ్డి ఇల్లును అద్దెకు ఇప్పించాడు. ఎంతో నమ్మకంగా ఉంటూ గత నెల 18న రాత్రి 7 గంటల సమయంలో నిందితుడు అన్నవరం ప్రసాదం అని మత్తు మందు కలిపి హనుమారెడ్డి, అతని భార్యకు ఇచ్చాడు. కొద్ది సేపటికే స్పృహ కోల్పోగా హనుమారెడ్డి భార్య మెడలోని బంగారు గొలుసును దొంగిలించి అక్కడ నుంచి పరారయ్యాడు. ఈ విషయమై బాధితులు రేణింగవరం పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశారు. ఎస్సై వినోద్‌బాబు తన సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితుడిని మంగళగిరి బస్టాండ్ వద్ద పట్టుకున్నట్లు, అతని వద్ద బంగారు రికవరీ చేసినట్లు ఎస్సై వినోద్‌బాబు తెలిపారు. నిందితుడు గుంటూరు జిల్లా తాడేపల్లి లోని వడ్డేశ్వరం గ్రామానికి చెందిన వ్యక్తిగా తెలిపారు.

తిమ్మాపురం స్పిన్నింగ్ మిల్లులో హత్య

- ఆలస్యంగా వెలుగులోకి దారుణం
- గోప్యతపై వలస కార్మికుల అనుమానాలు


విచారణ చేస్తున్న సీఐ బి.సుబ్బానాయుడు, ఎస్ఐ టి.శివరామకృష్ణ

యడ్లపాడు: ఈ నెల 10వ తేదీన వలస కార్మికుడిపై హత్యాప్రయత్నం జరగడంతో తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని తిమ్మాపురం పంచాయతీ పరిధిలోని శ్రీ మంజునాథ నూలు మిల్లులో ఒడిశా రాష్ట్రానికి చెందిన జగన్నాథ్ కుల్దీప్ పనిచేస్తున్నాడు. తన భార్య రుని కుల్దీప్, ముగ్గురు పిల్లలతో కలిసి మిల్లు క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నాడు. నెల రోజుల క్రితం జగన్నాథ్ భార్య, పిల్లలు స్వగ్రామానికి వెళ్లారు. ఈ క్రమంలో, జగన్నాథ్ భార్య గురించి అదే మిల్లులో పనిచేస్తున్న మంగూలు లేంక అనే వ్యక్తి ప్రశ్నించడంతో వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. కోపంతో మంగూలు తన గదిలోంచి కత్తి తీసుకొచ్చి జగన్నాథ్‌ను పొత్తికడుపులో పొడిచాడు. తీవ్ర గాయాలపాలైన జగన్నాథ్‌ను 108 అంబులెన్స్‌లో చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు రిఫర్ చేశారు. చికిత్స పొందుతున్న జగన్నాథ్ (38) శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో మృతి చెందాడు. దీంతో మృతుడి భార్య పోలీస్ స్టేషనుకు వెళ్లి ఫిర్యాదు చేసింది. ఎస్ఐ శివరామకృష్ణ కేసు నమోదు చేయగా, సీఐ సుబ్బానాయుడు దర్యాప్తు చేస్తున్నారు.

వలస కార్మికుల్లో భయాందోళనలు

ఉపాధి కోసం రాష్ట్రాన్నే వదిలి వచ్చిన వ్యక్తిపై మూడు రోజుల కిందట హత్యాప్రయత్నం జరిగినా, బాధితుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నా.. పోలీసులకు కూడా నూలు మిల్లు యాజమాన్యం సమాచారం ఇవ్వలేదు. ఈ ఘటన తాలూకు విషయాలను గోప్యంగా ఉంచడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఒకవేళ పోలీసులకు తెలిస్తే ఎందుకు బహిర్గతం చేయలేదని పేర్కొంటున్నారు. కార్మికశాఖ అధికారులు కూడా ఇలాంటి ఘటనల సమయంలో కన్నెత్తి చూడకపోవడం, కుటుంబాలతో రాష్ట్రాలు విడిచి వచ్చిన తమ జీవితాలకు ఎలాంటి భద్రత లేకుండా పోయిందని వలస కార్మికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. నూలుమిల్లు పనులు చేసుకుంటున్న వలస కార్మికులు ఈ ఘటనతో తమ కుటుంబాలతో తిరిగి వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.


మృతుడు జగన్నాథ్

వృద్ధాప్యంలో తల్లిదండ్రులను ఆదరించాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్


సదస్సులో మాట్లాడుతున్న జియావుద్దీన్

గుంటూరులీగల్: క్యాలెండరు యక్టివిటీస్‌లో భాగంగా జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు శుక్రవారం రామన్నపేటలోని మానవత స్వచ్ఛంద సేవా సంస్థలో ప్రపంచ వృద్ధుల వేధింపుల అవగాహన దినోత్సవంపై న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వృద్ధులు మనకు జ్ఞానాన్ని, అనుభవాన్ని అందించే వారని తెలిపారు. ప్రస్తుత సమాజంలో వృద్ధులు ఆర్థికంగా, మానసికంగా నిర్లక్ష్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు జన్మనిచ్చి మన అభివృద్ధి కోసం కృషి చేస్తారని, కొంత మంది వారిని పట్టించుకోకుండా వదిలేస్తున్నారని చెప్పారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే బహుమతిగా ఇచ్చిన ఆస్తులను రద్దు చేసి తిరిగి వారి సంక్రమిస్తాయనే చట్టం ఉందని తెలిపారు. తల్లిదండ్రులు కూడా పిల్లలకు ఆస్తులను ఇచ్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. నల్సా న్యాయ సేవల పథకం - 2016 ప్రకారం వృద్ధులకు ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. సదస్సులో జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, డాక్టర్ ప్రత్యూష, సుబ్బారావు, పెద్దలు పాల్గొన్నారు.

నాటుసారా తయారీదారులపై చర్యలు



మాచర్ల రూరల్: నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా పోలీసు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని హసనాబాద్ తండాలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. తండాలో ప్రతి ఇంటిని తనిఖీ చేసి 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారిలో 8 మందిని అనుమానిత వ్యక్తులుగా గుర్తించారు. నాటుసారా తయారు చేసినా, విక్రయించినా చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. కార్డన్ సెర్చ్ ఆపరేషన్‌లో రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ షేక్ నసీబ్ బాషా, ఎక్సైజ్ సీఐ ఎస్.వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం నిందితులను మెజిస్ట్రేట్, తహసీల్దార్ బి.కిరణ్ కుమార్ సమక్షంలో హాజరుపరిచారు.

సత్తా చాటిన జిల్లా బీచ్ కబడ్డీ క్రీడాకారులు



సత్తెనపల్లి: మచిలీపట్నంలో ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు జరిగిన 12వ జాతీయ స్థాయి బీచ్ కబడ్డీ మెన్ అండ్ ఉమెన్ పోటీలలో పల్నాడు జిల్లా క్రీడాకారులు ప్రతిభ చూపారు. దేశంలోని 29 రాష్ట్రాల క్రీడాకారులు హాజరు కాగా, ఆంధ్రప్రదేశ్ జట్టు ప్రథమ స్థానం సాధించింది. ఇండియా జట్టుకు పల్నాడు జిల్లా క్రీడాకారులు కృష్ణారెడ్డి, గోపి, హరీష్‌లు ఎంపికయ్యారు. వీరిని పల్నాడు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు మాబుహుస్సేన్, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు అచ్చిరెడ్డి, రియాజు, శేషయ్య, అనిల్, సభ్యులు సందీప్, సురేష్, ఆనంద్‌లు శుక్రవారం సత్కరించారు. మాబుహుస్సేన్ మాట్లాడుతూ ప్రతిభ చూపిన క్రీడాకారులను మరింతగా తీర్చిదిద్దుతానన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



సత్తెనపల్లి: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సత్తెనపల్లి మండలం పాకాలపాడు గ్రామంలో శుక్రవారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ముప్పవరపు రమణయ్య (44) గురువారం పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. సత్తెనపల్లి వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. రమణయ్యకు భార్య అంజలి, ఇరువురు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలకు వివాహమైంది. 2.70 ఎకరాలు గ్రామంలో పొలం కౌలుకు తీసుకొని పత్తి, పొగాకు సాగు చేస్తుండగా నష్టాలు రావడంతో ఆర్థిక సమస్యలు పెరిగి రమణయ్య ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు సత్తెనపల్లి రూరల్ పోలీసులకు తెలిపారు. కారు డ్రైవర్‌గా కూడా పనిచేస్తుంటాడని సమాచారం. తహసీల్దార్ కేఎస్ చక్రవర్తిని దీనిపై సంప్రదించగా.. త్రిమెన్ కమిటీ నిర్ధారించాల్సి ఉందని, కౌలు రైతు అయితే పూర్తి స్థాయిలో పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు వివరాలను సేకరించాల్సి ఉంటుందన్నారు.

నిబంధనలకు లోబడి విత్తనాలు అమ్మాలి



కొరిటెపాడు(గుంటూరు): విత్తన డీలర్లు, వ్యాపారులు విత్తన నియంత్రణ చట్టం-1983కు లోబడి వ్యాపారం నిర్వహించాలని గుంటూరు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి (డీఏఓ)యు.నరసింహారావు స్పష్టం చేశారు. స్థానిక కృషీ భవన్‌లో విత్తన డీలర్లు, వ్యాపారులతో శుక్రవారం సాయంత్రం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ విత్తన లైసెన్స్‌ను దుకాణాల వద్ద విధిగా ప్రదర్శించాలని తెలిపారు. విత్తన నిల్వలను తప్పకుండా ధరల సూచిక బోర్డు నందు విధిగా ప్రదర్శించాలని సూచించారు. స్టాక్ రిజిస్టర్లు, డెలివరీ చలానాలు, బిల్లు పుస్తకాలు తప్పకుండా స్థానిక వ్యవసాయ అధికారి ద్వారా ధ్రువీకరణ చేయించుకొని ఉపయోగించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. గడువు తీరిన విత్తనాలను నిల్వ చేయడం, విక్రయించడం నేరమని తెలిపారు. మిరప, పత్తి విత్తనాల వివరాలను సంబంధిత వ్యవసాయ శాఖ అధికారికి తెలిపి, వారి ఆమోదంతో మాత్రమే విక్రయం చేయాలని ఆదేశించారు. రైతులకు విధిగా బిల్లులు ఇవ్వాలని, అందులో పంట రకం, లాట్ నంబరు వివరాలు తప్పకుండా నమోదు చేయాలని ఆదేశించారు. హెటీ(గ్లైసిల్) పత్తి విత్తనాల అమ్మకం, సాగుకు దేశంలో ఆమోదం లేదన్నారు. ఈ విత్తనాలు అమ్మితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జిల్లా పరిధిలోని విత్తన డీలర్లు విధిగా ఫారం-డీని ప్రతి నెలా 5వ తేదీలోపు సమర్పించాలని తెలిపారు. సమావేశంలో విత్తన ఏఓ ఓ.సునీల్, డీలర్లు పాల్గొన్నారు.

